సాక్షి
నిజామాబాద్
శనివారం । 27 । జనవరి । 2024



క్రీడలు రాజకీయాలకు అతీతం

రాజకీయాలకు అతీతమైనవి కేవలం క్రీడలు మాత్రమేనని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



సజ్జల సాగులో నియంత్రణ..

సజ్జల సాగులో వ్యాపారులు నియంత్రణ విధానాన్ని పాటిస్తున్నారు. ఇందుకోసం రైతులకు పరిమితంగా విత్తనాలు ఇస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.3 /16.7

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలితీవ్రత కొనసాగుతుంది.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం
- ప్రజాప్రభుత్వంలో యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.10 లక్షలకు పెంపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్
- హాజరైన ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, మేయర్ నీతూకిరణ్



మాట్లాడుతున్న కలెక్టర్





సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, సీపీ, మేయర్



జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎంపీ అర్వింద్, సీపీ కల్మేశ్వర్

సుభాష్‌నగర్: ప్రజల ఉద్యమ ఆకాంక్షలు, ప్రజా సంక్షేమం నెరవేర్చడమే ప్రభుత్వ ప్రాధాన్యమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించే బాధ్యతతో అధికార యంత్రాంగం ముందుకు సాగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వంలో యువతకు ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, ఉద్యోగ క్యాలెండర్ ద్వారా ఖాళీల భర్తీకి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం గణతంత్ర దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ నీతూ కిరణ్, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, డీఎఫ్‌వో వికాస్ మీనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనంతరం జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై ప్రసంగించారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలనే ఉద్దేశంతో సంక్షేమంలో సరికొత్త అధ్యాయం రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీలైన అభయహస్తం, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, యువ వికాసం, చేయూత పథకాలను ఎన్నికల హామీలుగా ప్రకటించిందని గుర్తుచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.

'మహాలక్ష్మి' పథకంతో..

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 9 నుంచి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందని, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రోజుకు సగటున 75వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్ భారత్‌తో కలిపి రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రూ. 5లక్షల వైద్య సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.10లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. ఈపథకం కింద 1672 రకాల వ్యాధులకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స, శస్త్ర చికిత్సలను అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 22 ఆస్పత్రుల ద్వారా ఆరోగ్య శ్రీ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

'ప్రజాపాలన'లో దరఖాస్తుల స్వీకరణ..

ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 4,80,294 దరఖాస్తులను స్వీకరించామని తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌తో పాటు రైతు భరోసాతో యాసంగి సీజన్‌కు గాను ఇప్పటివరకు 1,76,113 మంది చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో రూ. 89.86కోట్లు జమ చేశామని చెప్పారు. మిగిలిన రైతుల ఖాతాల్లో కూడా నగదు జమ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

విద్యాశాఖ ద్వారా పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వందశాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, వారికి సాయంకాలం అల్పాహారం కూడా అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఉపాధిహామీ పథకం కింద 2.55 లక్షల జాబ్‌కార్డులు జారీ చేశామని, 4.83 లక్షల కూలీలు ఉన్నారన్నారు. 2023–24వ సంవత్సరానికిగాను 1,02,419 కుటుంబాలకు రూ. 69.73 కోట్లు చెల్లించామని, 819 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించామని తెలిపారు. ప్రతి జీపీలో నర్సరీ ఏర్పాటు చేసి, 10వేల మొక్కలు పెంచుతున్నామని, ఈ ఏడాదికి గాను 25లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 18,905 సంఘాలకు రూ. 1032.74 కోట్లు బ్యాంకు లింకేజీ లక్ష్యంగా పెట్టుకోగా, జనవరి 17 నాటికి 13,239 సంఘాలకు రూ.902.18 కోట్లు (87.36శాతం) పూర్తి చేశామన్నారు. గతేడాది జిల్లాకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నామని తెలిపారు. స్త్రీనిధి కింద ఈ ఏడాది రూ. 239 కోట్లు లక్ష్యం కాగా, రూ. 108 కోట్లు పంపిణీ చేశామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరంలో 1249 సంఘాలకు రూ. 106.53 కోట్లు బ్యాంకు లింకేజీ లక్ష్యం కాగా, 52 యూనిట్లకు రూ.52.51లక్షలు మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. ప్రజలు తమ హక్కులు ఉపయోగించుకుంటూ బాధ్యతలను విస్మరించకుండా దేశ సేవ, అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, శాంతి భద్రతల నిర్వహణకు అహర్నిశలు కృషి చేస్తున్న పోలీస్ యంత్రాంగానికి, వైద్యులు, పారిశుధ్య కార్మికులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నా యి. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన బాలబాలికల నృత్తప్రదర్శన అలరింపజేసింది. నగరంలోని విజయ్ హైస్కూల్, డిచ్‌పల్లి ఇందల్వాయి కేజీబీవీ విద్యార్థినుల ప్రదర్శనలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు బహూకరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను తిలకించారు. వేడుకల్లో కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థులు



వీరపాండ్య కట్టబ్రహ్మణ వేషధారణలో విద్యార్థి



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

న్యూస్‌రీల్

వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఇందిరా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరంలోని వైద్యకళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. ప్రొఫెసర్–06, అసిస్టెంట్ ప్రొఫెసర్–04, ట్యూటర్–10, సివిల్ అసిస్టెంట్ సర్జన్–16, జూనియర్ రెసిడెంట్–18 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫిబ్రవరి 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 11 గంటలకు మెడికల్ కళాశాల కార్యాలయంలో హాజరు కావాలన్నారు. పోస్టులకు సంబంధించి 7వ తేదీన అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చాంబర్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

డిచ్‌పల్లి రామాలయానికి యూఎస్ కాన్సుల్ జనరల్



డిచ్‌పల్లి : హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిచెందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

29 నుంచి 'పోచారం' రెండో విడత నీటివిడుదల

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి రెండో విడత నీటి విడుదలను ఈనెల 29న ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో 0.937 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఆయకట్టు కింద యాసంగి పంటలసాగు కోసం ఇటీవల మొదటి విడతగా నీటివిడుదలను పూర్తి చేశామన్నారు. ఈనెల 29 నుంచి రెండో విడత నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం పోచారం ప్రధాన కాలువలోని వంతెనల వద్ద పేరుకుపోయిన చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చిన్ని కృష్ణుడికి అభినందన



దోమకొండ: ఆర్గానిక్ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచి జాతీయ స్థాయిలో ఉత్తమ రైతు అవార్డును అందుకున్న చిన్నికృష్ణుడిని కలెక్టర్ అభినందించారు. గడికోటలో చిన్ని కృష్ణుడు స్టాల్ ఏర్పాటు చేసి, ప్రకృతి వ్యవసాయ పద్ధతితో కలిగే లాభాలను వివరించారు. ఆరేళ్లగా తాను దోమకొండలో ప్రకృతి వ్యవసాయ విధానం గురించి రైతులకు వివరిస్తున్నట్లు చెప్పారు. దీంతో ఆయనను కలెక్టర్ సన్మానించారు.

ఆర్మూర్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గింది

- అవిశ్వాస సమావేశానికి ఎమ్మెల్యే గౌరవసభ్యుడి హోదాలో హాజరయ్యారు
- స్పష్టతనిచ్చిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసిన ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై తిరుగుబాటు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అదే విషయాన్ని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ)కు నివేదిక పంపించామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టతనిచ్చారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించిన 20 రోజులు గడుస్తున్నా వైస్‌చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు కేటాయించకపోవడం, చైర్‌పర్సన్ ఎన్నిక నోటిఫికేషన్ ఆలస్యమవుతుండడంతో ఆర్మూర్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం కలెక్టర్‌ను కలిశారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. దీంతో ఆయన స్పందిస్తూ కేవలం 36మంది కౌన్సిలర్లకు మాత్రమే అవిశ్వాస తీర్మాన సమావేశం నోటీసులు పంపించామన్నారు. 24 మంది కౌన్సిలర్లతో కోరం ఉండడంతో అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని ఆర్డీవో వినోద్ కుమార్ నిర్వహించి నివేదిక పంపించారన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా దరఖాస్తు చేసుకున్నా ఆయనకు ఓటు హక్కు రాలేదన్నారు. అందుకే ఎమ్మెల్యే హోదాలో గౌరవప్రదంగా సమావేశానికి హాజరయ్యారని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో చైర్‌పర్సన్ ఎన్నిక కోసం త్వరగా నోటిఫికేషన్ వెలువడేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు కలెక్టర్‌ను కోరారు.

'అవిశ్వాస తీర్మానం వీగిపోయింది'

ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయినప్పటికీ అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని వినీతకు మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లు, నాయకులు ఆర్మూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. 36 మంది కౌన్సిలర్లలో 24 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి హాజరయ్యారన్నారు. అవిశ్వాస తీర్మాన సమావేశంలో సంఖ్యాపరంగా 25 మంది కోరం సభ్యులుగా ఆర్డీవో పేర్కొన్నారన్నారు. అందులో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తటస్థంగా ఉండగా 24 మంది కౌన్సిలర్లు మాత్రమే అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారని కూడా ఆర్డీవో చెప్పడమే కాకుండా కలెక్టర్‌కు నివేదించారన్నారు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లవుతుందని.. అందుకే పండిత్ వినీతను చైర్ పర్సన్‌గా తన విధులు నిర్వహించుకునేలా చూడాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు బదాం రాజ్‌కుమార్, కాటి హన్మాండ్లు, మురళీధర్‌రాజు పాల్గొన్నారు.

చదువుతో ఆలోచన శక్తి పెరుగుతుంది

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

బోధన్: చదువుతో ఆలోచన శక్తి పెరుగుతుందని.. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని స్వేరోస్ వ్యవస్థాపకుడు, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. చదువు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందని.. పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందన్నారు. శుక్రవారం సాలూరలో స్వేరోస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించిన అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని(లైబ్రరీ) ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి పల్లెలో విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తాను చదువుకోకపోతే పాలమూరు జిల్లాలోని తుంగభద్ర నదిలో చేపలు పట్టుకొని, కూలీనాలీ పనులు చేసుకుని బతికేవాడినన్నారు. దేశంలో ఆలయాలతో పాటు బడులు ఉండాలన్నారు. యువత క్రమశిక్షణతో చదివితే అనేక అద్భుతాలు సృష్టిస్తూ, నూతన ఆవిష్కరణలు రూపొందించవచ్చన్నారు. డాక్టర్ అంబేడ్కర్ వేల పుస్తకాలు చదివి జ్ఞానం సంపాదించాడని పేర్కొన్నారు. స్వేరోస్ నెట్‌వర్క్‌ను అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం లక్ష్యాలతో ఏర్పాటు చేశామని తెలిపారు. బీసీ కులగణన జరిగితే వారి జీవన స్థితిగతులు తెలుస్తాయని, వారిలో ఎంత మంది చదువుకు దూరమవుతున్నారో తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి కలిగోట్ సాయన్న, జిల్లా అధ్యక్షుడు అవినాష్, ప్రతినిధి సునీల్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సింగాడి పాండు, సేఫ్ జిల్లా అధ్యక్షుడు లింబూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా ఎట్ హోమ్





కళాప్రదర్శనలు

సుభాష్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులు, కళాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరందు, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, అదనపు డీసీపీ జయరాం పాల్గొన్నారు.



హాజరైన జిల్లా అధికారులు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఆర్మూర్‌టౌన్‌: జాతీయస్థాయి బేస్‌బాల్‌ పోటీలకు ఆర్మూర్‌ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ దుర్గారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం ఎంపికైన విద్యార్థులు వినయ్‌, అద్యుత్‌, జ్ఞానంగూర్‌లను ఉపాధ్యాయులు వైస్‌ ప్రిన్సిపాల్‌ సంధ్యారాణి, ఉపాధ్యాయులు శ్రీధర్‌, సురేశ్‌, రాజేందర్‌, సంజీవ్‌ అభినందించారు.

వరంగల్‌లో లైన్‌మన్‌కు అవార్డు అందజేత



నిజామాబాద్‌నాగారం: వరంగల్‌లోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో రిపబ్లిక్‌ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, సిబ్బందికి టీఎస్‌ ఎన్‌పీడీసీఎల్‌ సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన డి-2 సెక్షన్‌ పరిధిలోని లైన్‌మన్‌ పల్లికొండ సాయికుమార్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించారు.

ఉత్సాహంగా సాగుతున్న ఫుట్‌బాల్‌ టోర్నీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఉమెన్స్‌ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఉమెన్స్‌ ఫుట్‌బాల్‌ అండర్‌-13 టోర్నమెంట్‌ ఉత్సాహంగా శుక్రవారం కొనసాగింది. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. శనివారం సెమీస్‌ పోటీలను నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్‌ సంఘం కార్యదర్శి జావిద్‌ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మీర్‌ ఫారుఖ్‌, కోచ్‌ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువలో గాలింపు చర్యలు

బాల్కొండ: మండలంలోని బోదేపల్లికి చెందిన గడ్డం చిన్న సాయన్న గురువారం వరద కాలువలో గల్లంతయ్యాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ప్రాజెక్ట్‌ ఉన్నతాధికారులు గురువారం రాత్రి 7 నుంచి శుక్రవారం సాయంత్రం 5 వరకు నీటి విడుదలను నిలిపివేసినా ఆచూకీ లభించలేదు. దీంతో బాధిత కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో సుజాత

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొనేందుకు తాడ్వాయి మండల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుజాత ఎంపికై వేడుకల్లో హాజరైనట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్‌ పేర్కొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారిపై అవగాహన



దోమకొండ: పంటలకు డ్రోన్‌తో మందుల పిచికారిపై శుక్రవారం గడికోటలో అవగాహన కల్పించారు. లైఫ్‌ ఎన్‌జీవో ఆధ్వర్యంలో దీనిని ప్రదర్శించారు. ఎన్‌జీవో ప్రతినిధి బాల ప్రసాద్‌, గడికోట వారసులు కామినేని అనిల్‌కుమార్‌ ఉన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



అడిషనల్‌ కలెక్టర్‌ యాదిరెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ మైదానంలో రిపబ్లిక్‌ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్తమ సేవలను మంచి గుర్తింపు లభిస్తుందని, విధి నిర్వహణలో ఉన్న ప్రతి ఉద్యోగి, సిబ్బంది నిక్కచ్చిగా ఉండాలన్నారు. అనంతరం పరేడ్‌ గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ అర్వింద్‌, ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, మేయర్‌ నీతూకిరణ్‌, కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ కల్మేశ్వర్‌, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– ఖలీల్‌వాడి



చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ | మకరందు, మున్సిపల్‌ కమిషనర్‌, నిజామాబాద్‌ | వినోద్‌కుమార్‌, ఆర్డీవో, ఆర్మూర్‌ | పి.రాజాగౌడ్‌, ఆర్డీవో, బోధన్‌ | రాజేంద్రకుమార్‌, ఆర్డీవో, నిజామాబాద్‌ | జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి | రసూల్‌బీ, జిల్లా వెల్ఫేర్‌ ఆఫీసర్‌ | ఆర్‌.శంకర్‌, డీపీ ఆర్‌ఈ, నిజామాబాద్‌ | దుర్గాప్రసాద్‌, జిల్లా విద్యాధికారి | జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నిజామాబాద్‌ | సురేశ్‌, ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌(ఆర్‌అండ్‌బీ) | మురళీమనోహర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి | రఘురాజ్‌, డీఐఈవో



ప్రశాంత్‌కుమార్‌, ఏవో, కలెక్టరేట్‌ | వేణుగోపాల్‌, సూపరింటెండెంట్‌, కలెక్టరేట్‌ | రషీద్‌ సూపరింటెండెంట్‌, కలెక్టరేట్‌ | శ్రీనివాసరావు, సూపరింటెండెంట్‌, కలెక్టరేట్‌ | రవీందర్‌రెడ్డి, సీనియర్‌ అసిస్టెంట్‌, కలెక్టరేట్‌ | సంతోష్‌కుమార్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, కలెక్టరేట్‌ | మోహిజొద్దీన్‌, ఏవో, కలెక్టరేట్‌ | మహ్మద్‌ నసీరొద్దీన్‌, ఎస్సై, కలెక్టరేట్‌ | హరిబాబు, అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ)సీసీ | మునీరుద్దీన్‌, డిప్యూటీ తహసీల్దార్‌, మోపాల్‌ | గోపాలకృష్ణ, ఎంపీడీవో, ఎడపల్లి | వెంకటరమణ, ఏవో, డీఆర్‌డీఏ | గోపి, ఏవో, వ్యవసాయ శాఖ



కిరణ్‌కుమార్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, వ్యవసాయ శాఖ | భరత్‌కుమార్‌, బీటీఎం, ఆత్మ | రాకేశ్‌కుమార్‌, సబార్డినేట్‌, పౌరసరఫరాల శాఖ | శ్రీదేవి, జూనియర్‌ అసిస్టెంట్‌, మైనార్టీ సంక్షేమ శాఖ | ఎండీ జావిద్‌పాషా, పీఆర్‌వో, డీపీఆర్‌వో | షేక్‌ ఖాసీమ్‌, డ్రైవర్‌, డీపీఆర్‌వో | బారిక్‌ అహ్మద్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్‌, పశుసంవర్థక శాఖ | ధర్‌సింగ్‌, అసిస్టెంట్‌ సెక్రటరీ, మార్కెటింగ్‌ శాఖ | వి.గంగాధర్‌, టీఎస్‌ రెడ్‌కో జిల్లా మేనేజర్‌ | జయరాం, డీసీపీ | గిరిరాజు, డీసీపీ | జగదీశ్‌ చందర్‌, ఏసీపీ, ఆర్మూర్‌ | రాజశేఖరరాజు, ఏసీపీ, టాస్క్‌ఫోర్స్‌



రవీందర్‌రెడ్డి, ఏసీపీ, సీసీఆర్‌బీ | సయ్యద్‌ మసూద్‌ అహ్మద్‌, సీనియర్‌ సూపరింటెండెంట్‌ | చందర్‌రాథోడ్‌, ట్రాఫిక్‌ సీఐ | శ్రీశైలం, ఎస్బీ సీఐ | వీరయ్య, బోధన్‌ సీఐ | సురేందర్‌రెడ్డి,ఎంవీ, నిజామాబాద్‌ | రాజేందర్‌, సీఐ, నిజామాబాద్‌ | ప్రవీణ్‌కుమార్‌,ఎస్సై, నిజామాబాద్‌ | మహేశ్‌ ఎస్సై, నిజామాబాద్‌ రూరల్‌ | అంజమ్మ, ఎస్సై, నిజామాబాద్‌ | మహేందర్‌, ఎస్సై, బోధన్‌ | మౌనిక, ఏఈ విద్యుత్‌శాఖ, ఆర్మూర్‌ | హనుమాన్‌దాస్‌, ఐకేపీ ఉద్యోగి, నిజామాబాద్‌

క్రీడలు రాజకీయాలకు అతీతమైనవి



షటిల్‌ ఆడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- రాష్ట్రస్థాయి షటిల్‌ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: క్రీడలు రాజకీయాలకు అతీతమైనవని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లిలోని కేబీఏ ఇండోర్‌ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి షటిల్‌ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సోషల్‌ మీడియాలో, వీడియో గేమ్స్‌ మోజులో ఉన్న రోజుల్లో కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రియల్‌ గేమ్స్‌ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సొంత డబ్బులతో ఇండోర్‌ స్టేడియం నిర్మించుకోవడం గొప్ప విషయమన్నారు. సమాజంలో రాజకీయాలు లేనివి క్రీడలేనని వెల్లడించారు. తమది స్వతహాగా క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబమని, తన తండ్రి, దివంగత రైతు నేత వేముల సురేందర్‌ రెడ్డి జాతీయస్థాయి వాలీబాల్‌ క్రీడాకారుడన్నారు. తానూ జాతీయస్థాయి వాలీబాల్‌ క్రీడాకారుడినని, తన తమ్ముడు అజయ్‌ రెడ్డి యూనివర్సిటీ క్రికెట్‌ క్రీడాకారుడిగా, చెల్లెలు రాధికా రెడ్డి రాష్ట్రస్థాయి కోకో క్రీడాకారిణిగా రాణించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌ దేవేందర్‌, సర్పంచ్‌ స్వామి, తహసీల్దారు ఆంజనేయులు, సర్పంచ్‌ గడ్డం స్వామి, ఎంపీటీసీ మైలారం సుధాకర్‌, కేబీఏ గౌరవాధ్యక్షుడు అహ్మద్‌ హుస్సేన్‌, సలహాదారు లుక్క గంగాధర్‌ పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రభాకర్‌ (ఫైల్‌)

మోపాల్‌: మండలంలోని తాడెంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడెంకు చెందిన వేల్పూర్‌ ప్రభాకర్‌ (55) స్థానిక సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన అనిల్‌ బైక్‌పై వేగంగా ప్రభాకర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబీకులు అనిల్‌పై దాడికి యత్నించి, వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి ఒకరు..

సదాశివనగర్‌: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మర్రి ఆశిరెడ్డి(49) తన పంట పొలంలో నీరు పారించేందుకు ఉదయం వెళ్లగా కాలుజారి కాలువలో ఉన్న బురదలో పడడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రాధవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

మాక్లూర్‌: మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలోని గేటు తాళాలను దుండగులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు.ఆలయంలో అమ్మవారిపై ఉన్న 6 గ్రాముల బంగారం, వెండి కళ్లు, హుండీ నగదును దొంగిలించారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండలం కొల్లూర్‌లో రెండు చోట్ల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్‌ శుక్రవారం తెలిపారు. దాడిలో గ్రామ శివారులో ఆడుతున్న వారి నుంచి రూ.8440, చెరువు వద్ద రూ. 11,210 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



మాక్లూర్‌: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ రాజశేఖర్‌రాజు శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలోని మాదాపూర్‌ శివారులో కృత్రిమ ఇసుక డంప్‌పై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో అనుమతి లేకుండా తరలిస్తున్న 4 ఇసుక టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మాదాపూర్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్‌ సీఐలు శంకర్‌ భూషణ్‌,అజయ్‌బాబు, సిబ్బంది సుధాకర్‌ ఉన్నారు.

రేషన్‌ బియ్యం..

లింగంపేట: మండలంలోని మెంగారంలో అక్రమంగా రేషన్‌ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై ప్రకాశ్‌ తెలిపారు. మెంగారం శివారులో శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా రేష న్‌ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గు ర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. యాదాద్రి జిల్లా బొమ్మలరామారం గ్రామం నుంచి బియ్యాన్ని ఎల్లారె డ్డి వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో 5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్‌ఆర్‌ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫారెస్ట్‌ కార్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో జిల్లా కేంద్రానికి చెందిన షేక్‌ ఆజం 1.315 కిలోల ఎండు గంజాయిని విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం గంజాయిని సీజ్‌ చేసి షేక్‌ ఆజంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వో వెంట ఎస్సై మల్లేశ్‌, సిబ్బంది షబ్బీర్‌, ప్రభాకర్‌, సంగయ్య, రవి, సంజయ్‌ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్‌ శుక్రవా రం తెలిపారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవ లు జరుగుతున్నాయని ఈ క్రమంలో ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబీకులు తెలిపారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మేకల కాపరి ..



మైసయ్య (ఫైల్‌)

మాక్లూర్‌: మండలంలోని అడవి మామిడిపల్లికి చెందిన మైసయ్య అదృశ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. మైసయ్య గురువారం ఉదయం మేకలను తీసుకొని అడవికి వెళ్లగా రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనాథలమనే భావనను వీడాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్‌

నిజామాబాద్‌నాగారం: తాము అనాథలమని, తమకు ఎవరూ లేరనే ఆలోచనను దరి చేరనివ్వొద్దని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు బాలసదన్‌ చిన్నారులకు సూచించారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న బాలసదన్‌లో రిపబ్లిక్‌ డే వేడుకల కార్యక్రమానికి కలెక్టర్‌ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. విద్యతోనే చక్కని భవిష్యత్తు ఉంటుందని ఆ దిశగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ధైర్యాన్ని కోల్పోకుండా, ఎలాంటి సమస్య ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం అండగా ఉంటుందని అధైర్య పడొద్దని అన్నారు. సదన్‌లోని సిబ్బంది పిల్లలను బాగా చూసుకోవడం వల్లే కొందరు విద్యార్థులు ఇంజినీరింగ్‌ వంటి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీ కల్మేశ్వర్‌, అదనపు కలెక్టర్‌ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, ట్రైనీ ఐపీఎస్‌ చైతన్య, డీడబ్ల్యూవో రసూల్‌ బీ, కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌, బాలసదన్‌ పర్యవేక్షకురాలు వినోద తదితరులు పాల్గొన్నారు.

సజ్జ సాగులో నియంత్రణ విధానం



ఆరబోసిన సజ్జ పంట(ఫైల్‌ ఫోటో)

- పరిమితంగానే విత్తనం సరఫరా చేస్తున్న సీడ్‌ వ్యాపారులు
- కొనుగోళ్లకు క్వింటాలుకు రూ. 7,400ల వరకు ధర ఒప్పందమే కారణం
- మునుపెన్నడూ లేని ధర నిర్ణయం

మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌ మండలం తిమ్మాపూర్‌లో సజ్జ పంటను సాగు చేయడానికి అనేకమంది రైతులు ముందుకు వచ్చారు. ఇందుకు కారణం మునుపెన్నడూ లేని విధంగా క్వింటాలు సజ్జలకు రూ. 7,200ల ధర చెల్లించడానికి సీడ్‌ వ్యాపారులు ముందుకు రావడమే. గ్రామంలో గతేడాది 50 ఎకరాల నుంచి 60 ఎకరాల వరకు సజ్జను సాగు చేశారు. కానీ ప్రస్తుతం 200ల ఎకరాల్లో పంటను సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. సీడ్‌ వ్యాపారులు మాత్రం 120 ఎకరాలకు సరిపడేంత విత్తనాన్ని మాత్రమే పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ రైతుల ఇష్టానికి విరుద్ధంగా 80 ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గిపోనుంది. ఇది ఒక్క తిమ్మాపూర్‌లో ఎదురైన సమస్యనే కాదు. సజ్జను సాగు చేసే అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి. సజ్జలకు గణనీయమైన ధర నిర్ణయం అవుతుండడంతో సాగు విషయంలో నియంత్రణ అవసరమని వ్యాపారులు భావిస్తున్నారు. సజ్జలను బైబ్యాక్‌ విధానంలో కొనుగోలు చేయడానికి ధర ఒప్పందం చేసుకుంటున్న వ్యాపారులు సీడ్‌ పంపిణీని గతంలో మాదిరిగా ఎన్ని ఎకరాలకు అంటే అన్ని ఎకరాలకు అందించడం లేదు. సాగు విషయంలో నియంత్రణ విధానం పాటిస్తున్నారు. మోర్తాడ్‌, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్‌, బాల్కొండ, వేల్పూర్‌, ఆర్మూర్‌, నందిపేట్‌, జక్రాన్‌పల్లి మండలాల్లో సజ్జ పంటను సాగు చేస్తున్నారు. గతంలో 20వేల నుంచి 25వేల ఎకరాల వరకు సజ్జను సాగు చేసేవారు. దశాబ్దకాలం కింద సజ్జలకు అప్పట్లో క్వింటాలుకు రూ. 6వేల ధర చెల్లించిన వ్యాపారులు సాగు విస్తీర్ణం పెరగడంతో ధర తగ్గిస్తూ వచ్చారు. గతేడాది క్వింటాలు సజ్జలకు రూ. 4,300ల ధర మాత్రమే చెల్లించారు. సజ్జల సాగు వల్ల ఎక్కువ లాభం లేకపోవడంతో రైతులు నువ్వుల పంటను సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. సజ్జల సాగు జిల్లాలో సుమారు 10వేల ఎకరాలకు తగ్గిపోయింది. నువ్వులకు క్వింటాలుకు రూ. 18వేల వరకు ధర లభిస్తుండడం, మార్కెటింగ్‌ సౌకర్యం బాగుండటంతో రైతులు సజ్జలకు ప్రత్యామ్నాయంగా నువ్వులను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. సజ్జల సాగు ప్రశ్నార్థకం కావడంతో సీడ్‌ వ్యాపారులు ధరను ఏకంగా రూ. 7,400ల వరకు పెంచారు. ముప్కాల్‌ మండలం వేంపల్లిలో సజ్జలకు అత్యధికంగా ధర చెల్లించడానికి వ్యాపారులు రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకున్నారు. ఇతర గ్రామాల్లో రూ. 7,200ల చొప్పున ధర ఒప్పందం జరుగుతోంది.